క్లుప్తంగా

ఫైలేరియాపై మలేరియా సిబ్బందికి శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫైలేరియాస్ వ్యాధికి సంబంధించి మలేరియా విభాగంలో పనిచేస్తున్న సబ్‌యూనిట్ అధికారులు, ఎంపీహెచ్ఎస్‌కి శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. లబ్బీపేటలోని జిల్లా మలేరియా కార్యాలయంలో డీఎంఓ డాక్టర్ మోతీబాబు అధ్యక్షతన జరిగిన శిక్షణలో రాష్ట్ర ఫైలేరియా ప్రతినిధి శ్రీహరివెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఫైలేరియా కేసుపై భౌతిక ప్రదర్శనతో పాటు గ్రేడింగ్, చికిత్స, వైకల్య నివారణ, కిట్ వాడకం, రాత్రి రక్తపూతలు పరీక్ష, చికిత్సలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

22న మాజీ సైనికులకు అవగాహన సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులకు నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈ నెల 22న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ కళ్యాణ వీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువుల సమస్యలు తెలుసుకొనేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఐ కార్డ్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

మురుగు కాలువ పనులు వేగవంతం

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శివాలయం సమీపంలో మురుగు కాలువ పనులను వేగవంతం చేశారు. ముత్యాలంపాడు శివాలయం సమీపంలో మురుగు కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలకు వాహన చోదకులతో పాటు పాదచారులు, భక్తులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ నత్తనడకన మురుగుకాలువలు శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పనులు వేగవంతం చేయటంతో పాటు రాకపోకలకు వీలుగా బల్లలు వేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంత కుమార్ అన్నారు. దుర్గాపురానికి చెందిన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం పూర్ణానందంపేట స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లిష్ మీడియం ఎలిమెంటరీ స్కూల్ కార్యాలయానికి శనివారం కుర్చీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో 64 ఏళ్ల క్రితం తన తండ్రి తన విద్యాభ్యాసం ప్రారంభింపజేశారన్నారు. తాను చదివిన పాఠశాలకు బాధ్యతగా కుర్చీలు అందజేస్తున్నానని వచ్చే విద్యా సంవత్సరంలోల విద్యాసామగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.స్కూల్ ప్రధాన ఉపాధ్యాయరాలు పద్మలత, క్లబ్ కోశాధికారి, గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ రిజర్వేషన్ పెంపుపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడాకారుల ప్రయోజనాలను కాంక్షిస్తూ స్పోర్ట్స్ రిజర్వేషన్ 2 నుంచి 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో 29 క్రీడలకు మాత్రమే స్పోర్ట్స్ రిజర్వేషన్ వర్తించేదని, 3 శాతం అమలుతో 65 క్రీడలకు రిజర్వేషన్ వర్తిస్తుందని ప్రకటించారు.

ఏ, బీ కేటగిరీలుగా విభజించడం దురదృష్టకరం: కేపీ రావు

65 క్రీడలలో 36 క్రీడలను 'ఏ' కేటగిరీగా మిగిలిన క్రీడలను 'బి' కేటగిరీగా విభజిస్తూ జీవో విడుదల చేయడం దురదృష్టకరమని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు శనివారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. జీవోను సవరించాలని కె.పి.రావు ప్రభుత్వాన్ని కోరారు.

అసాంఘిక శక్తుల తిష్ట

- ఘర్షణలకు కేంద్ర బిందువుగా రామకృష్ణాపురంరోడ్డు, బుడమేరు వంతెన
- ఆధ్యాత్మిక కేంద్రాల మధ్యే అసాంఘిక కార్యకలాపాలు
- ఇబ్బందులకు గురవుతున్న మహిళలు
- పట్టించుకోని పోలీసులు!



రామకృష్ణాపురంలోని దేవాలయం పరిసరాల్లో అసాంఘిక చర్యలు మితిమీరుతున్నాయి

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): రామకృష్ణాపురం రోడ్డులో నిత్యం ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపర్చుకోవడం పరిపాటైంది. వీటికి కేంద్రబిందువుగా బుడమేరు వంతెన మారింది. దేవినగర్ నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన రహదారి కావడంతో విద్యార్థినిలు, కార్యాలయాలకు వెళ్లి వచ్చే మహిళలు వీరి గొడవలకు భయభ్రాంతులకు గురవుతున్నారు. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి

ఆలయ పరిసరాల్లోనే..

ఈ ప్రాంతంలోని శ్రీదుర్గాభవాని ఆలయం పరిసర ప్రాంతాల్లో కొందరు మద్యం సేవిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు చెబుతున్నారు. దీంతో గుడికి రావాలన్నా భయపడాల్సి వస్తోందంటున్నారు.

ఆటోల్లోనే మద్యం విక్రయాలు..

ఇక్కడ అనధికారికంగా ఉన్న ఆటోస్టాండ్‌లోనే అక్రమంగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం కొనుగోలు చేసిన వారు గుడి పరిసర ప్రాంతాల్లో నిలిచిఉన్న ఆటోలు, గుడిమెట్లు, బడ్డీకొట్ల వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తూ నానాగొడవ చేస్తున్నారు.

ఇరిగేషన్ స్థలంలో..

అధికార పార్టీ నేతలు, ఆ పార్టీకి చెందిన ఆటో యూనియన్ లీడర్ల అండదండలతో సింగ్‌నగర్ బుడమేరు కట్ట నుంచి దేవినగర్ వరకు ఉన్న ఇరిగేషన్ స్థలంలో యథేచ్ఛగా మద్యం తాగుతున్నారు. దీనిపై ఎవరైనా అడిగితే దాడులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఉన్న ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కిరాయిలకు వచ్చిన ఆటో డ్రైవర్లపై దాడులు చేస్తున్న ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం రాత్రి ఇదే తరహాలో ఈ గుడి వద్ద ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడటం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన చోటుచేసుకుంది. పరిస్థితి ఇలాగే ఉంటే పిల్లలను బయటకు పంపడానికి కూడా భయపడాల్సి వస్తుందని స్థానిక మహిళలు వాపోతున్నారు.

స్పందించని 'రక్షకులు'

దేవినగర్ రోడ్డులో గొడవలు జరిగినప్పుడు పోలీసులు వచ్చి దాడులకు పాల్పడేవారి నుంచి సెల్‌ఫోన్‌లు తీసుకోవడంగానీ, లేకపోతే వారి నుంచి డబ్బులు తీసుకుని చూసీ చూడనట్లు ఉంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులే ఇలా వ్యవహరిస్తే ఎలా అంటున్నారు.



దేవాలయం వెనుక మద్యం సేవిస్తున్న మందుబాబులు

నిత్యం గొడవలు..



దేవినగర్ రోడ్డులో నిత్యం గొడవలే. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోని రోజే ఉండదు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నాం. ఇక్కడి సమస్యపై పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– బషీర్, స్థానికుడు

బస్‌స్టాప్ వద్దకు వెళ్లాలంటే భయమేస్తోంది



దేవినగర్ నుంచి బుడమేరు వద్ద బస్‌స్టాప్‌నకు వెళ్లి బస్సులు, ఆటోలు ఎక్కాలన్నా భయమేస్తోంది. దేవాలయం ఎదుటే తిష్టవేసి మద్యం సేవించే వారు ప్రవర్తించే తీరు చూస్తుంటే భయమేస్తోంది. పోలీసులు వీరి ఆగడాలను అరికట్టాలి.

– జయమ్మ, స్థానికురాలు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలి



గ్రంథాలయంలో పుస్తకాల ర్యాక్‌లను శుభ్రం చేస్తున్న పాఠకులు, సిబ్బంది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ చెప్పారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ జరిగింది. సిబ్బంది, పాఠకులు గ్రంథాలయ పరిసర ప్రాంతాలు, పుస్తకాలు, ర్యాకులు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. చిన్న వయసు నుంచే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సూచించారు. స్థానిక 26వ డివిజన్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమం జరిగింది.

–నూజివీడు రోడ్డు అయోధ్యనగర్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు, సూర్యపబ్లిక్ స్కూలు విద్యార్థులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్



సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాలపై పట్టు సాధించాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులతో సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నగరంలోని గాంధీ హిల్ ప్రాంగణంలో ఉన్న ప్లానిటోరియం, భవానీపురంలోని అప్‌కాస్ట్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పాములకాలువ వద్ద ఉన్న బృందావన్ పార్క్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని సైన్స్ పరికరాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి అక్కడ ఉన్న నమూనాలు పని చేసే విధానాలపై అవగాహన పొందారు. అనంతరం డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆయా సైన్స్ అంశాలపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్ తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులను ఈ టూర్‌కు తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజకుమార్, ఉమాదేవి, షేక్ సైదా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హాస్పిటల్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్ శిబిరం



రైల్వే హాస్పిటల్‌లో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు, సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జైడస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో విజయవాడ రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలోని రేడియాలజీ బ్లాక్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్(లివర్) స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఊబకాయం, మద్యపానం, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, హెచ్‌బీవీ/హెచ్‌సీవీ ఇన్‌ఫెక్షన్ లక్షణాలతో బాధపడుతున్న రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవమని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, జైడస్ లైఫ్ సైన్సెస్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకున్న చెత్త



విజ్ఞాన విహార పాఠశాల సమీపంలో పేరుకుపోయిన చెత్తచెదారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని 28వ డివిజన్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించారు. వీటిని ఇప్పటి వరకు తొలగించలేదు. చెట్ల కొమ్మలు ఎండిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. చెత్తకుప్పలు క్రిమికీటకాలు, దోమలకు ఆవాసకేంద్రంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విజ్ఞాన విహార పాఠశాల సమీపంలో చెత్త పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తచెదారం, చెట్లకొమ్మలు తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా

లబ్బీపేట(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు నలుగురు 99 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా తెలిపారు. విజయవాడలోని తమ క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మధుసూదనరెడ్డి యేరువ 99.89 శాతం, ఉజ్వల్ బపన్న డోరపాడల 99.56 శాతం, నిదీష్ యేమిని 99.54 శాతం, నితీష్ సుంకర 99.33 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ ఫలితాలు విద్యార్థుల దృఢ సంకల్పం, అకడమిక్ అద్భుతతను ప్రదర్శిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయానికి తాము గర్వపడుతున్నామని చెప్పారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ శారద జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన పసుమర్తి బిందుశ్రీ యశస్విని జేఈఈ మెయిన్స్‌లో 88.22 పర్సంటేజ్ సాధించింది. అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించింది. జేఈఈ మొదటి సెషన్‌లో కళాశాలకు చెందిన ఈమని శాండిల్ ప్రణవ కృష్ణ 83.73 పర్సంటేజ్ సాధించాడు. అధ్యాపకుల కృషికి నిదర్శనంగానే విద్యార్థులు జేఈఈ లో ర్యాంక్‌లు సాధించారని కళాశాల సెక్రటరీ కుందా రామనారాయణ అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్ తదితరులు అభినందించారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం



బందరు రోడ్డులో విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు



మామిడి పండ్లు

నగరంలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. పండ్ల రారాజైన మామిడి విక్రయాలు ఏలూరు రోడ్డు, బందరు రోడ్డుతో పాటు నగర వ్యాప్తంగా జోరందుకున్నాయి. నోరూరించే మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' శనివారం క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఏలూరు రోడ్డులో విక్రయిస్తున్న మామిడి పండ్లు

కళాకారులు సాంస్కృతిక వారధులు



పరుచూరి విజయలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కారం చేశారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, దూపాటి శ్రీదేవి, ప్రభలశ్రీనివాస్, శివశర్మ పాల్గొన్నారు, భారతి, సుహాసిని, మల్లీశ్వరి, సుశీల్‌కుమార్ ఈస్టర్‌గీతాలు, క్లాసికల్ చిత్రగీతాలను ఆలపించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మికి లెజెండరీ కల్చరల్ బిరుదుతో సత్కరించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఉపాధి అవకాశాలు పొందిన విద్యార్థులతో యజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడు మరిన్ని అవకాశాలు లభిస్తాయని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ విజయోత్సవం పేరుతో వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ వచ్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. తమ కళాశాల కేవలం విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలను లభించే దిశగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులను వారివారి రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దటంతో పాటుగా ప్లేస్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకోవటానికి అవసరమైన నైపుణ్యాలను సైతం అందిస్తున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఈ విద్యా సంవత్సరం 350 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో జాబ్‌లను పొందారన్నారు. సుమారు 95 శాతం విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీఎస్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ



కళ్ల జోళ్లు అందుకున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు కళ్ల జోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు మాక్సివిజన్ హాస్పిటల్ సహకారంతో గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 74 మందిలో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ నగర అధ్యక్షురాలు డాక్టర్ వి.శ్రీదేవి విద్యార్థులకు కళ్ల జోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి చూపులో తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యంతో అశ్రద్ధ వహిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని చెప్పారు. విద్యార్థులకు కళ్ల జోళ్లు అందించిన రోటరీ క్లబ్ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ లయన్స్ క్లబ్ ఆఫ్ చుండూరి వెంకటరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం మధురానగర్ మెయిన్ రోడ్డులోని గౌతమ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్ అన్నాబత్తుల శరాబందీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో గుండె సంబంధిత వైద్యపరీక్షలు, ఎముకలు, గర్భకోశ, సంతాన సాఫల్యత, దంత, మధుమేహం, బీపీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేస్తారని వివరించారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈనెల 21న ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని చాంబర్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

జానపద సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

విజయవాడకల్చరల్: జానపద సంప్రదాయాన్ని కాపాడుకోవాలని పీఎంకేఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకరమణ అన్నారు. ఏపీ చలనచిత్ర అభివృద్ధి మండలి, పీఎంకేఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కళారూపాల ప్రదర్శనలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో వెంకటరమణ మాట్లాడుతూ జానపద గీతాలు జాతీయ సంపదగా అభివర్ణించారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ రంగస్థల నటుడు ఆనంద్‌కొప్పుల పాల్గొన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు జానపద గీతాలను ఆలపించారు. కళాకారులు పలు అంశాలను ప్రదర్శించారు.